


డేటా ప్రాసెసింగు సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక రెవెన్యూ డివిజినల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన జిల్లా డేటా ప్రాసెసింగు సెంటరును జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ గురువారం ప్రారంభించారు. ఈ కేంద్రంలో సర్వేకు సంబంధించిన మొత్తం సమాచారాన్ని భద్రపర్చడం జరుగుతుందని జిల్లా సర్వే, భూమి రికార్డుల అధికారి కె.రాజకుమార్ తెలిపారు. సర్వేవెరిఫికేషను విలేజ్ ఫైల్స్, భూరక్షకు సంబంధించిన సమాచారం, యుఎల్ పిన్ జనరేషను, ఎల్.పి.ఎమ్. బల్క్ జనరేషను, విలేజ్ మ్యాప్ తయారీ మొదలైన పనులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఇక్కడ పొందుపర్చనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జెసి ఆర్. గోవిందరావు, కె.ఆర్.సి.సి. డిప్యూటీ కలెక్టరు కేశవనాయుడు, డిఆర్ఒ కె.హేమలత, సర్వే అధికారులు పాల్గొన్నారు.

కదం తొక్కిన విద్యార్థులు

- ఫలించిన ఎస్ఎఫ్ఐ సైకిల్ యాత్ర, దీక్షల పోరాటం
- స్థానిక సమస్యలు పరిష్కరిస్తాం : ఇన్‌ఛార్జి డిఆర్ఒ
- 6న విద్యాశాఖ అధికారులతో చర్చలకు హామీ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన గతంలో సైకిల్‌యాత్ర చేపట్టిన విద్యార్థులు ఇటీవల వారం రోజుల పాటు కలెక్టరేట్ వద్ద నిరాహారదీక్షలు చేపట్టారు. గురువారం చేపట్టిన మహాధర్నాకు అధికారులు స్పందించి జిల్లాలోని విద్యారంగ సమస్యపై డిసెంబర్ 6న శాఖ అధికారులతో చర్చించి, స్థానికంగా ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కారానికి హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనను విరమించారు.

తొలుత ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా కలెక్టరేట్ వరకూ పెద్ద ఎత్తున విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, అనంతరం కలెక్టరేట్ ఆవరణలో ధర్నా చేపట్టారు. ధర్నానుద్దేశించి ఎస్ఎఫ్ఐ రాష్ట్రకమిటీ సభ్యులు సిహెచ్.వెంకటేష్ మాట్లాడుతూ విద్యాశాఖ ఉన్నతాధికారులు సంక్షేమ హాస్టళ్లకు, విద్యాసంస్థలను సందర్శించే పరిస్థితి లేదని, ఆ పని ఎస్ఎఫ్ఐ చేస్తూ పరిశీలించిన సమస్యల్ని పరిష్కారం చేయాలంటే అధికారులు ముందుకు రాకపోవడం దుర్మార్గమని అన్నారు. కనీసం విద్యార్థులకు మరుగుదొడ్లు కూడా లేకపోవడం బాధాకరమని, వసతిగృహాలకు సొంత భవనాల్లేక చాలీచాలని గదుల్లో కొట్టుమిట్టాడుతున్న పరిస్థితి జిల్లాలో ఉందని తెలిపారు. విద్యార్థులు కోరుతుంది గొంతమ్మ కోరికలు కావాలని, వారి విద్యాభివృద్ధికి చేస్తున్న పోరాటాలని, వాటిని వెంటనే పరిష్కరించాలని చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.పండు, పి.రాజశేఖర్ మాట్లాడుతూ పోరాటమే సరైన మార్గమన్న నినాదం ఈ పోరాటం ద్వారా రుజువైందని అన్నారు. జిల్లా ఏర్పడి రెండేళ్లవుతున్నా కనీసం మౌలికసదుపాయాలు కల్పించకపోవడం దారుణమని, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అందించే అరకొర మెస్ చార్జీలతో విద్యార్థులకు పౌష్టికమైన ఆహారం అందడం లేదని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని, బకాయి మెస్ బిల్లులు విడుదల చేయాలని, పార్వతీపురంలో గల బిసి, ఎస్‌సి పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లకు సంత భవనాలు ఏర్పాటు చేయాలని, సాలూరు పోస్టుమెట్రిక్ బాయ్స్ హాస్టలుకు రోడ్ సౌకర్యం కల్పించాలని, గర్ల్స్ పోస్ట్మెట్రిక్ హాస్టల్ కు, పాలకొండ పోస్ట్మెట్రిక్ హాస్టలకు సొంత భవనాలు నిర్మించాలని, వీరగొట్టం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం ఏర్పాటు చేయాలని, పార్వతీపురంలో మెడికల్, ఐటిఐ, పిజి, సాలూరులో బిఇడి, పాలకొండలో పిజి గుమ్మలక్ష్మీపురం డైట్ కళాశాలలు నిర్మించాలని, కురుపాం ఇంజనీరింగ్ కళాశాల భవనం పనులు పూర్తి చేయాలని, గరుగుబిల్లి, సీతంపేట మండలాల్లో జూనియర్ కళాశాలలు నిర్మాంచాలని, బలిజిపేట, కురుపాం, భామిని, పాచిపెంట మండల కేంద్రాల్లో డిగ్రీ కళాశాలలు నిర్మించాలని, కొమరాడ, సీతానగరం, వీరఘట్టాం, మక్కువ, పాచిపెంట, భామిని, బలిజిపేట మండలాల్లో పోస్టు మెట్రిక్ హాస్టళ్లను నిర్మించాలని, పాలకొండ డిగ్రీ కళాశాలకు ప్రహరీ గోడ నిర్మించాలని, సాలూరు కేంద్రంలో ఆశ్రమ పాఠశాల నిర్మించాలని, పాఠశాల, సంక్షేమ హాస్టళ్లకు సరిపడ్డ పర్మినెంట్ వర్కర్స్, వార్డలను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లపై స్పందించిన జాయింట్ కలెక్టర్ గోవిందరావు, డిఆర్ఒ ఇంచార్జ తో స్పష్టమైన హామీ, చర్చలు జరిపేందుకు తేదీ తెలియజేయకపోవడంతో విద్యార్థులంతా ఆగ్రహించి, కలెక్టర్ కార్యాలయం ఆవరణలోనే బైఠాయించారు. పోలీసులకు, విద్యార్థులకు కొంత ఘర్షణ జరిగిన అనంతరం, డిసెంబర్ 6 బుధవారం విద్యాశాఖ సంబంధిత అధికారులతో చర్చలకు ఎస్ఎఫ్ఐ నాయకులను ఆహ్వానిస్తున్నట్టు ఇన్‌ఛార్జి డిఆర్ఒ కేశవ నాయుడు ద్వారా సమాచారాన్ని అందించారు. పోరాట విజయంగా భావించి విద్యార్థులు ఆందోళనను విరమించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు కె.రాజు, సింహాచలం, గంగారాం, వరుణ్ పెద్దఎత్తున విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



పట్టణంలో భారీ ర్యాలీ చేస్తున్న విద్యార్థులు





ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్రకమిటీ సభ్యులు వెంకటేష్; ఇన్‌ఛార్జి డిఆర్ఒకు సమస్యలు వివరిస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజశేఖర్

తప్పుడు విమర్శలు చేసినా, వార్తలు రాసినా...

తగ్గేదేలే... కేసులే

- టిడిపి నాయకులకు, విలేకర్లకు డిప్యూటీ సిఎం వార్నింగ్
- జగనన్న దళిత భూ శాశ్వత హక్కు పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి - సాలూరు

తప్పుడు విమర్శలు చేసినా, వార్తలు రాసినా వదిలేది లేదని డిప్యూటీ సిఎం రాజన్నదొర హెచ్చరించారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో జగనన్న దళిత భూ శాశ్వత హక్కు పథకం కింద పట్టణ, మండలంలోని దళితులకు పట్టాల పంపిణీలో రాజన్నదొర సంచలన వ్యాఖ్యలు చేశారు. టిడిపి నాయకులు, దానికి అనుకూలంగా వార్తలు రాసే విలేకరులనుద్దేశించి ఆయన వ్యాఖ్యలు చేశారు. తనపై విమర్శలు చేసేటప్పుడు వాస్తవాలు తెలుసుకోకుండా చేస్తే సహించబోనని చెప్పారు. టిడిపి నాయకులు చేసిన తప్పుడు విమర్శలు వార్తలు రాసిన విలేకరులనూ ఉపేక్షించేది లేదన్నారు. 'తాడూ బొంగరం లేనప్పుడే గల్లీ నుంచి ఢిల్లీ దాకా న్యాయ పోరాటం చేశాను, మీ అందరి ఆశీస్సులతో నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాను, ఇప్పుడు మంత్రి, డిప్యూటీ సిఎం హెూదాలో ఉన్నాను, కాబట్టి అలాంటి వారిని సుప్రీంకోర్టు వరకైనా లాగుతాను' అని ఆయన ఆవేశంగా మాట్లాడారు. టిడిపి పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాజన్నదొరనుద్దేశించి పలు ఆరోపణలు చేశారు. డిప్యూటీ సిఎంగా, గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా రాజన్నదొర నియోజకవర్గానికి ఏమీ చేయలేదని, గిరిజన యూనివర్సిటీ ఆయన వల్లనే పక్క జిల్లాకు వెళ్లిపోయిందని తిరుపతిరావు ఆరోపించారు. ఈ వ్యాఖ్యలనుద్దేశించి రాజన్నదొర ఆవేశపూరిత వ్యాఖ్యలు చేశారు. తన హయాంలో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో గానీ, ఇప్పుడు వైసిపి ప్రభుత్వం హయాంలో గానీ ఏం అభివృద్ధి జరిగిందో చర్చకు రావాలని అనేక సార్లు పిలిచినా టిడిపి నాయకులు రాలేదన్నారు. టిడిపి ప్రభుత్వం హయాంలోనే పాచిపెంటలో ఏర్పాటు చేయాల్సిన గిరిజన యూనివర్సిటీ కొత్తవలసకు వెళ్లిందని చెప్పారు. అప్పుడు నియోజకవర్గ టిడిపి నాయకులు ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు. ఉమ్మడి జిల్లా టిడిపి నేత, మాజీ కేంద్ర మంత్రి అశోక్ గజపతి రాజు గిరిజన యూనివర్సిటీని పాచిపెంట మండలంలో ఏర్పాటు చేయాలని కోరారని, కొత్తవలస తరలింపుపై ఆయన కూడా అసంతృప్తి వ్యక్తం చేశారని గుర్తు చేశారు. 2014నుంచి 2019 వరకు టిడిపి ప్రభుత్వం హయాంలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులు ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో గాని, ఇప్పుడు వైసిపి ప్రభుత్వం హయాంలో గాని తాను ఏయే అభివద్ధి పనులు చేశానో చెప్పడానికి సిద్ధంగా వున్నానని అన్నారు. దీనిపై త్వరలో ఒక పుస్తకాన్ని పార్టీ నాయకులు విడుదల చేస్తారని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో పట్టణ టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు పనుల కోసం తన వద్దకు రాలేదా అని ప్రశ్నించారు. టిడిపి నాయకులు వాస్తవాలు తెలుసుకుని విమర్శలు చేస్తే మంచిదని, లేకపోతే సివిల్, క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి వుంటుందని హితవు పలికారు. టిడిపి నాయకులు చేసే తప్పుడు విమర్శలు వార్తలుగా రాసే విలేకరుల పైనా కేసులు పెడతానని ఆయన హెచ్చరించారు.



లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తున్న రాజన్నదొర

భూములు అమ్ముకోవద్దు

జగనన్న భూ శాశ్వత హక్కు పథకం కింద లబ్ధిపొందిన దళితులు భూములపై హక్కులు వచ్చాయని, అమ్మకానికి పెట్టొద్దని డిప్యూటీ సిఎం రాజన్నదొర కోరారు. భవిష్యత్‌లో భూమికి విలువ పెరుగుతుందని చెప్పారు. ఇప్పటికే కొంతమంది దళితులు భూములను అమ్మేసినట్లు తన దృష్టికి వచ్చిందని చెప్పారు. పిల్లల చదువు కోసమో, ఆరోగ్య అవసరాల కోసమో భూమి తాకట్టు పెట్టుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని చెప్పారు. పట్టణంలోని పెద హరిజనపేట, చినహరిజనపేటకు చెందిన దళితులకు పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, వైస్‌చైర్మన్‌లు జర్జాపు దీప్తి, వంగపండు అప్పలనాయుడు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శులు జర్జాపు సూరిబాబు, దండి శ్రీనివాసరావు, అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు జర్జాపు ఈశ్వరరావు, ఎఎంసి చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, కౌన్సిలర్లు, తహశీల్దార్ బాలమురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ జయరాం, సర్పంచ్ లు పాల్గొన్నారు.

వైస్ ఎంపిపి గైర్హాజరు

ఈ కార్యక్రమానికి ఎంపిపి జి.రాములమ్మ, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ రెడ్డి పద్మావతి గైర్హాజరయ్యారు. డిప్యూటీ సిఎం రాజన్నదొర హాజరైన ఈ కార్యక్రమానికి మండల జెసిఎస్ కన్వీనర్ కళ్ళే పిల్లి త్రినాథనాయుడు కూడా హాజరు కాలేదు. తహశీల్దార్ కార్యాలయానికి సంబంధించిన సమాచారం తనకు అందడం లేదని వైస్ ఎంపిపి అలక వహించినట్లు తెలుస్తోంది. రెండు రోజుల క్రితం దండిగాంలో గిరిజనులకు భూపట్టాల పంపిణీ కార్యక్రమంలో కూడా వైస్ ఎంపిపి రెవెన్యూ కార్యాలయానికి సంబంధించిన సమాచారం తనకు అందడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం : యుటిఎఫ్

ప్రజాశక్తి - కలెక్టరేట్

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కొరకు పోరాడనున్నట్టు యుటిఎఫ్ జిలా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహనరావు తెలిపారు. ఈ మేరకు గురువారం పోరాట కార్యక్రమ నోటీసును కలెక్టరేట్ ఎఒకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దీర్ఘ కాలకంగా పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ ఉపాధ్యాయుల పిఎఫ్ సమస్య లు, ప్రమోషన్స్, బదిలీలు, సర్వీసురూల్స్, అర్బన్ ఎంఇఒ పోస్టులు తదితర అంశాలపై ఈ కార్యక్రమాన్ని నిర్వస్తున్నట్లు తెలిపారు. డిసెంబరు 5న పార్వతీపురం, సాలురు మున్సిపల్ కేంద్రాల్లో నిరసన, 15న కలెక్టరేట్ వద్ద ధర్నా, 30న రాష్ట్ర స్థాయి ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోరాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఉపాధ్యాయులను కోరారు. నోటీసు ఇచ్చిన వారిలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు కె.భాస్కరరావు, ఎన్.శ్రీనివాసరావు, పోలినాయుడు, వరప్రసాద్, గోవింద్, హరికష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా నగర పంచాయతీ సమావేశం

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి అధ్యక్షతన గురువారం జరిగిన సర్వసభ్య సమావేశం సదాసీదాగా జరిగింది. 2018-19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అవుట్ సోర్సింగ్‌లో ఉద్యోగులకు రూ.5లక్షలు జీతాలు బకాయిలు ఉన్నాయని, దీనికి అనుమతులు ఇవ్వాలని అధికారులు సమావేశం దృష్టికి తీసుకురాగా పాలకవర్గం అడ్డుతగిలింది. ఆ హయాంలో తమ పాలకవర్గం లేదని, ఎవరు పని చేశారో తమకు తెలియదని దీన్ని వాయిదా వేయాలని కౌన్సిలర్లు వెలమల మన్మధరావు, దుప్పాడ పాపినాయుడు, కిల్లారి మోహన్, గంగునాయుడు తదితరులు అధికారులకు తెలిపారు. అలాగే సెప్టిక్‌ట్యాంకు పాలకొండలో ఏర్పాటు చేస్తామని ఒక వ్యాపారి దరఖాస్తు చేసుకోగా, దాని ఆమోదానికి కౌన్సిల్ సమావేశంలో చర్చ జరగ్గా కౌన్సిలర్లు వ్యతిరేకించారు. ప్రైవేటు వ్యక్తి సెప్టిక్‌ట్యాంకు నడిపిస్తే తామెందుకు ఆమోదించాలని నిలదీశారు. దీనివల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో వైస్ ఛైర్మన్ పల్లా ప్రతాప్, కమిషనర్ సర్వేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి ప్రాధాన్యత : ఎస్‌పి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో గల ప్రాధాన్యత కలిగిన కేసుల్లో విచారణ వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం కలిగేలా కేసులు పరిష్కారం వేగవంతం చేయాలని ఎస్‌పి విక్రాంత్ పాటిల్ అన్నారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోకున్న కాన్ఫరెన్స్ హాలులో గురువారం పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులు, మర్డర్, ప్రాపర్టీ, వాహనాల దొంగతనం, 174 క్రైమ్ పిసి కేసులు, మిస్సింగ్, చీటింగ్ కేసులు, సైబర్ నేరాలు, ఇతర కేసులను సమీక్షించారు. పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలు, ప్రస్తుత కేసుల స్థితిగతులు, నమోదైన కేసుల్లో నేరస్తుల అరెస్టు, కేసు దర్యాప్తు తీరుతెన్నులపై సంబంధిత పోలీస్ అధికారులతో ఆరా తీసి కేసుల ఫైల్స్, రికార్డులను పరిశీలించారు. కేసుల ఛేదింపునకు, పరిష్కారానికి, నేర నియంత్రణకు దోహదం చేసే పలు సూచనలు, మెళకువలను అధికారులకు దిశా నిర్దేశాలు చేశారు. ఏదైనా ఒక ఫిర్యాదు నమోదైతే సంబంధిత సమగ్ర సమాచారాన్ని సేకరించి ఆ సమస్యను సత్వరమే పరిష్కరించేలా ఎస్‌హెచ్‌ఒలు కార్యాచరణను అమలు చేయాలన్నారు. అలాగే ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని పాటిస్తూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా మెలిగి వారి ఫిర్యాదులను స్వీకరించి జవాబుదారీగా ఉండాలని, మహిళలు, చిన్నారుల సంబంధిత ఫిర్యాదులపై తక్షణమే స్పదించాలని, పోలీస్ శాఖపై నమ్మకం పెంపొందించేలా సేవలు అందించాలని సూచించారు. జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాలపై సమీక్షించారు. ఎక్కువ ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్ల వద్ద అవసరమైన వార్నింగ్ సిగ్నల్ లైటులను, సూచిక బోర్డులను, స్టాపర్లను ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలను నివారించాలని సూచించారు. అలాగే ఎస్‌హెచ్‌ఒలు తమ పరిధిలో రహదారి భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను చైతన్యవంతులను చేసి రోడ్డు ప్రమాదాలు తగ్గే విధంగా మెరుగైన చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ప్రాధాన్యత కేసులను అడిగి తెలుసుకొని వాటిలో శిక్షలు పడేలా చేసి బాధితులకు న్యాయం జరిగేలా చేయాలని సూచించారు. అక్రమ రవాణా అరికట్టడంలో, నాన్ బైల్‌బుల్ వారంట్లను జారీ చేయడంలో చిత్తశుద్ధితో పనిచేయాలని, రౌడీ షీటర్లపై ప్రత్యేక దృష్టి సారించి తరచూ కౌన్సిలింగ్ నిర్వహించాలని సూచించారు. స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో, పోలీసు బృందాలతో మెరుపు దాడులు చేసి గంజాయి, నాటు సారాతో పాటు అన్ని రకాల అక్రమ రవాణాలకు అడ్డుకట్ట వేయాలని, డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్, వాహనాల తనిఖీలు ఉధృతం చేయాలని ఆదేశించారు. అలాగే లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించే అవకాశం ఉన్న అన్ని కేసులను వచ్చే నెలలో జరగబోయే లోక్ అదాలత్‌లో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు సాంకేతికంగా అవగాహన కలిగి ఉండాలని అజ్ఞాత వ్యక్తుల నుండి వచ్చే సంక్షిప్త సమాచారాలు, మెయిల్స్ లలోని లింకులను ఓపెన్ చేయకుండా తిరస్కరించాలని, పొరపాటున లింక్‌లను క్లిక్ చేస్తే బ్యాంకు ఖాతాలో నగదు మాయమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఎవరైనా బాధితులు సైబర్ క్రైమ్ 1930కు గానీ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ http://cybercrime.gov.in కు గాని వెంటనే తెలిపి సహాయం పొందాలని ఎస్పీ సూచించారు.

అనంతరం ప్రాపర్టీ కేసుల్లో ముద్దాయిలను పట్టుకొని చోరీ అయిన సొత్తును రికవరీ చేసి మెరుగైన సేవలను అందించడంలో ఉత్తమ ప్రతిభ చూపిన పోలీసు అధికారులను, సిబ్బంది ఎస్‌పి ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. నేర సమీక్ష సమావేశంలో అదనపు ఎస్పీ డాక్టర్ ఒ.దిలీప్ కిరణ్, దిశా డిఎస్పీ ఎస్ఆర్ హర్షిత, డిఎస్‌పిలు జివి కృష్ణారావు, జి.మురళీధర్, ఎల్. శేషాద్రి, అజీజ్, పలువురు సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్

గృహనిర్మాణ లక్ష్యాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - సాలూరు

గృహ నిర్మాణ లక్ష్యాలు పూర్తి చేయాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి విష్ణు చరణ్ అన్నారు. గృహ నిర్మాణాలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే జనవరి 19 నాటికి 2619 గహాలు పూర్తి చేయాలని ఆదేశించారు. లబ్ధిదారులను ప్రేరేపించాలని, సొంత గృహంలో నివాసం ఉండటం వలన కలిగే ఆనందం వివరించాలని ఆయన పేర్కొన్నారు. గృహ నిర్మాణ సామగ్రి అందుబాటులో ఉంచాలని, త్వరగా ఇళ్ల పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. గృహ నిర్మాణాలకు అవసరమైన అన్ని మౌళిక సదుపాయాలు సమకూర్చాలని ఆయన చెప్పారు. సమావేశంలో హౌసింగ్ డిఇ సోమేశ్వర రావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకు అకౌంట్ నుంచి రూ.22 వేలు మాయం

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

మండలంలోని బీరుపాడు పంచాయతీ పరిధిలో గల శ్రీరంగపాడులో ఓ గిరిజన మహిళ బ్యాంకు ఖాతా నుండి రూ.22 వేలు నగదు మాయమైనట్లు బాధితురాలు లబోదిబోమని ఆవేదన వ్యక్తం చేస్తుంది. శ్రీరంగపాడు గ్రామానికి చెందిన హిమరక బిసో తన వ్యక్తిగత శ్రీవిశాఖ గ్రామీణ బ్యాంకు ఖాతాలో నిల్వ చేసుకున్న రూ.40వేలు ఉండగా, అక్టోబర్ 6న రూ.8వేలు వేలు, 21న రూ.7వేలు, 27న 7వేలు చొప్పున బ్యాంకు నుంచి తీసినట్లు నమోదైంది. సదరు పాసుబుక్‌లో నిల్వ ఉంచిన సొమ్మును గ్రామ వాలంటీర్ కీలక గిరిధర్ ఆధార్ అనుసంధానం వేలిముద్రం ద్వారా తీసేసినట్లు అనుమానం కలిగిందని ఆమె తెలిపింది. తన పిల్లల కోసం నిల్వ చేసిన సొమ్మును గ్రామ వాలంటీరే మినీ ఎటిఎం ద్వారా నగదును కాజేసినట్లు ఆమె వాపోయింది. వాలంటీర్ను అడిగితే మీకు ఇళ్లు మంజూరైందని, కావున మీరు వేలిముద్రలు వేయాలని అనడంతో నా వేలిముద్రలు వేశానని వాపోయింది. అయితే ఇలా తన ఖాతా నుంచి నగదును తీసివేస్తాడని అనుకోలేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయమై ఉన్నతాధికారులు తక్షణమే విచారణ జరిపి తగు న్యాయం చేయాలని ఆమె కోరింది.



విద్యార్థులను పాఠ్యాంశాల గురించి అడుతున్న పిఒ కల్పనాకుమారి

విద్యార్థులు బాగా చదవాలి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఐటిడిఎ పిఒ కల్పనా కుమారి అన్నారు. మండలంలోని మల్లి గురుకుల పాఠశాలను పిఒ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ పాఠశాలలో అదనంగా నిర్వహిస్తున్న అదనపు తరగతులను విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. ఏదైనా సబ్జెక్టులో సందేహాలు ఉంటే వెంటనే నివృత్తి చేసుకోవాలన్నారు. ఈ సంధర్భంగా విద్యార్థులకు గణితం, రసాయన శాస్త్రంలోని అంశాలను విద్యార్థులకు బోధించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ వాసు దేవ రావు, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తున్న ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు


ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

నాలుగున్నర ఏళ్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతున్నారని మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు అన్నారు. మండలంలోని కృష్ణపల్లిలో గల ఆయన స్వగృహంలో గల విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతినెలా జీతాలు సక్రమంగా చెల్లించలేకపోవడంతో ఉపాధ్యాయ, ఉద్యోగులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అధికారంలోకి రాక మునుపు వారికి మాట ఇచ్చిన ప్రకారం సిపిఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేసిన కారణంగా వారి పట్ల కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తున్నారని తెలిపారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యావ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైపోయిందని విమర్శించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడమే కాకుండా సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయులు తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తరగతి గదులకు అనుగుణంగా ఉపాధ్యాయుల్లేకుండా విద్యార్థులు చదువులు కొనసాగించలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. కృష్ణపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో 8 తరగతులుగా గానూ ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే విద్యా బోధన చేస్తున్నారని, దీనివల్ల విద్యార్థులు ఏ విధంగా చదువుకుంటారని ప్రశ్నించారు. రాబోయే ఎన్నికలు చాలా కీలకమైనవని, రాష్ట్రంలోని అన్ని వర్గాలు గత టిడిపి పాలనతో బేరీజు వేసుకొని వైఎస్ జగన్‌కు బుద్ధి చెప్పాలని కోరారు.

'తెలుగు వెలుగుల దీప్తి గురజాడ'

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

తెలుగు సాహిత్యంలో తరతరాలకు దారి చూపే తెలుగు వెలుగుల దీప్తి మహాకవి గురజాడ అప్పారావు అని ప్రముఖ కవి, రచయిత, గంటేడ గౌరినాయుడు అన్నారు. గురజాడ వెంకట అప్పారావు 108వ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక జిల్లా కేంద్రాసుపత్రి కూడలిలో ఉన్న మహాకవి విగ్రహానికి సాహితీ లహరి వ్యవస్థాపకులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ మంచిపల్లి శ్రీరాములుతో కలిసి, స్నేహ కళా సాహితి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గురజాడ అప్పారావు దేశభక్తి గీతాలను ప్రముఖ కవి సిరికి స్వామి నాయుడు ఆలపించగా, తెలుగు సాహిత్యానికి గురజాడ చేసిన సేవలు గురించి వక్తలు ప్రసంగించారు.



గురజాడ విగ్రహానికి పూలమాల వేస్తున్న గౌరునాయుడు, శ్రీరాములు

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, ప్రతి ఓటరు ఓటు హక్కును వినియోగించుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు తెలిపారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక ఆర్‌సిఎం ప్రాంగణంలో జిల్లా కార్యాలయాల సముదాయం నుంచి కలెక్టరేట్ వరకూ ఓటరు నమోదు అవగాహన ర్యాలీని జాయింట్ కలెక్టర్ ప్రారంభించారు. ర్యాలీ అనంతరం కలెక్టరు కార్యాలయం వద్ద మానవహారంగా ఏర్పడి ఓటరు అవగాహనకు సంబంధించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టరు మాట్లాడుతూ దేశ భవిష్యత్తును నడిపించేది యువతేనని, ప్రపంచంలోనే అత్యధిక యువత కలిగిన భారతదేశమని, ప్రతియువత ఓటరుగా నమోదు చేసుకొని ప్రజాస్వామ్య వ్యవస్థలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. డిసెంబరు 2,3 తేదీల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో 2024 జనవరి 1 నాటికి 18ఏళ్లు పూర్తికానున్న ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని, అందుకు కావాల్సిన ఫారాలు బూత్ లెవల్ అధికారుల వద్ద ఉంటాయని లేదా ఎన్నికల కమిషను వెబ్సైట్ నందు నేరుగా నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. ర్యాలీకి హాజరైన విద్యార్థులు తమ కుటుంబాల్లో 18 ఏళ్ల నిండిన వారుంటే వారిని ఓటరుగా చేర్పించాలని, ఓటు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించు కొనేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ఆర్‌డిఒ కె.హేమలత మాట్లాడుతూ 18 ఏళ్ళ నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని, ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. ఓటర్లకు ఇవిఎంలపై అవగాహన, ఓటు వేసే విధానాన్ని తెలుసుకోవాలని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శాశ్వత, మొబైల్ ఎలక్ట్రానిక్ ఓటింగు మిషను ప్రదర్శన సెంటర్లను సందర్శించి నమూనా ఓటు వేసి, ఓటు వేసే విధానాన్ని తెలుసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కెఆర్‌సిసి ఎస్‌డిసి కేశవనాయుడు, జిల్లా స్పోర్ట్స్ అభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావు, తహశీల్దారు శివన్నారాయణ, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మానవహారాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ గోవిందరావు

ఓటు హక్కును నమోదు చేసుకోవాలి : పిఒ

పాలకొండ : అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సీతంపేట ఐటిడిఎ పిఒ కల్పన కుమారి అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటు హక్కు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఓటు హక్కు చాలా విలువైనదని, దాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని అన్నారు. ఓటు హక్కు వినియోగం ద్వారా బంగారు భవిష్యత్‌ను నిర్మించుకోవాలన్నారు. అర్హత ఉండి ఓటు హక్కు పొందని వారు సచివాలయాలకు వెళ్లి ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. అవసరమైతే విద్యార్థులే బాధ్యత తీసుకుని గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేసి అర్హులతో ఓటు హక్కు నమోదు చేయించాలని సూచించారు. ఇలాంటి సదస్సులు ఏర్పాటు చేసి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దారు సోమేశ్వరరావు, ప్రిన్సిపల్ ఎం.శ్యాంబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న ప్లాంటేషన్ జెసి అశోక్‌కుమార్

మొక్కల పెంపకంపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

మొక్కల పెంపకంపై దృష్టి సారించాలని ప్లాంటేషన్ జాయింట్ కమిషనర్ ఎం.అశోక్ కుమార్ జీడి, మామిడి రైతులకు సూచించారు. మండలంలోని గంగంపేటలో ఎకరా విస్తీర్ణంలో సాగైన మామిడి, జీడి మొక్కలను పరిశీలించారు. అలాగే కె.ఇచ్ఛాపురం సమీపాన మట్టివానివలసలో చేపడుతున్న ఉపాధి పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. శ్రమకు తగ్గ వేతనం అందుకునేలా పనుల్లో పాల్గొని జీవన ప్రమాణాలు మెరుగుపర్చుకోవాలని సూచించారు. కమిషనర్ వెంట డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఎపిడి జి.శ్రీహరిరావు, ఆర్.సురేష్ నాయుడు, సర్పంచ్ ఎపిఒ జి.సత్యంనాయుడు, ఇసి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిఫిలు, వేతనదారులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు

ప్రజాశక్తి - పాచిపెంట

నాడు నేడు పనుల్లో భాగంగా మండలంలో 47 అంగన్వాడీ కేంద్రాలకు మౌలిక సదుపాయాలైన తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, పెయింటింగుల కోసం నిధులు మంజూరైనట్లు పాచిపెంట ఐసిడిఎస్ సిడిపిఒ బి.అనంతలక్ష్మి తెలిపారు. ఈ మేరకు స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద గురువారం మౌలిక సదుపాయాలు వినియోగంపై అంగన్వాడీ కార్యకర్తలకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు, హెచ్ఎంలకు, సూపర్వైజర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఇఒ పి.జోగారావు, అంగన్వాడీ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

రావుపల్లిలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండల పరిధిలోని రావుపల్లిలోని శ్రీ సత్య సాయి బాబా మందిరం ఆవరణలో గురు వారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంత మైందని సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు (మహేష్) తెలిపారు. పిఎంపి వైద్యులు, ఆశయ హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మేరకు శ్రీకాకుళం జిల్లా రాగోలు జేమ్స్ హాస్పిటల్‌కు చెందిన వైద్యులు డాక్టర్ మర్రి దయాకర్, డాక్టర్ పసుపులేటి గాయిత్రీదేవి, డాక్టర్ అత్తి లక్ష్మణ్‌తో పాటు కంటి వైద్య నిపుణులు డాక్టర్ అప్పల కొండలు తనిఖీలు నిర్వహిం చారు. రావుపల్లితో పాటు కొత్తపల్లి, కొత్తూరు, తదితర గ్రామాలకు చెందిన వారికి వైద్య శిబిరంలో తనిఖీలు నిర్వహించారు. ఈవైద్య శిబిరంలో ఉచితంగా మందులను అందజేశారు. ఈ వైద్య శిబిరంలో ఆపరేషన్లకు గుర్తించిన వారిని రాగోలు జెమ్స్ హాస్పిటల్ లో ఆపరేషన్లు చేయడం జరుగుతుందని సర్పంచ్ మహేష్ తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పి రాజేశ్వరరావు, ఏరియా మేనేజర్ ఎం.రాజేష్, పిఆర్ఒ అరసాడ రాజు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ హేమలత

నెలాఖరుకు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

జగనన్న ఇళ్ల నిర్మాణాలు డిసెంబర్ నెలాఖరుకు పూర్తి చేయాలని ఆర్‌డిఒ కె.హేమలత అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 689 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. 480 ఇళ్ల ఉన్నాయని, 1902 ఇళ్లు వచ్చాయని, వీటి నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. హౌసింగ్ డిఇ ఆర్‌వివి ప్రసాద్ మాట్లాడుతూ ప్రతిరోజు లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలు పట్ల పూర్తి చేయాలని, గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి పూర్తిచేసేలా వాలంటీర్లు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఎంపిడిఒ బి.కృష్ణమహేష్‌రెడ్డి, హౌసింగ్ ఎఇ సిహెచ్ జానకీరామ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు పి.కృష్ణ, సిహెచ్ సత్యనారాయణ, వివిధ గ్రామాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు వాలంటీర్లు పాల్గొన్నారు.



వర్క్‌షాపును తనిఖీ చేస్తున్న కార్మికశాఖ అధికారులు

పిల్లలతో పనులు చేయిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - కురుపాం

చిన్నపిల్లలను పనిలో చేర్పిస్తే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని సహాయ కార్మిక అధికారి సిహెచ్.వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం కురుపాంలో గల పలు దుకాణాలను సందర్శించి తనిఖీలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా షాప్ యజమానులతో మాట్లాడుతూ పిల్లలను పనుల్లో చేర్పించడం వల్ల వారి జీవితం బాల్యంలో మగ్గిపోయి బాల కార్మికులుగా తయార వుతారన్నారు. కావున పిల్లలను ఎవరూ షాపుల్లో పనుల నిమిత్తం చేర్పించొద్దని అలా చేర్పించినట్లయితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. కార్యక్రమంలో జూనియర్ సహాయకులు రజిని పాల్గొన్నారు.

మార్కొండపుట్టిలో వై నీడ్ జగన్

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని మార్కొండ పుట్టి సచివాలయం పరిధిలో గురువారం వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమంలో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న వైసిపి నాయకులు మావుడి రంగునాయుడు పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పది ఇళ్లకు వెళ్లి జగన్ ఆంధ్రాకు ఎందుకు కావాలని, గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి గల వ్యత్యాసాన్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మెల్లిక రాములమ్మ, ఎంపిటిసి భాగ్యలక్ష్మి, మాజీ సర్పంచ్ శ్రీరాములు నాయుడు, నోడల్ అధికారి దేవకుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో కాంగ్రెస్ ప్రచారం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని కేదారిపురం, సెంటర్‌గూడ గ్రామాల్లో గడపగడపకు మన కాంగ్రెస్ కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానం ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నిమ్మక సింహాచలం, జిల్లా గిరిజన విభాగం అధ్యక్షులు రాఘవేంద్రరావు, రైతు విభాగం అధ్యక్షులు నాగేశ్వరరావు, బిసి విభాగం అధ్యక్షులు గణేష్, సూర్యం, పాపారావు, పకీరు తదితరులు పాల్గొన్నారు.



కేదాపురిపురంలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అంగన్వాడీల సమ్మెకు మద్దతు ఇవ్వాలి

ప్రజాశక్తి-పాలకొండ

సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు డిసెంబర్ 8 నుంచి చేపట్టిన సమ్మెకు మద్దతు ఇవ్వాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కె.రాము కోరారు. ఇందుకు సంబంధించి కరపత్రాలను గురువారం ఆటో స్టాండ్ వద్ద ప్రచారం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలకు ప్రభుత్వం కనీసం వేతనం రూ.26వేలు ఇవ్వాలని, మినీ అంగన్వాడీ సెంటర్లను మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగరాజు, రామరాజు, రామకృష్ణ, ఆనంద్, శ్రీను పాల్గొన్నారు.

శంకరరావుకు ఘన సత్కారం

ప్రజాశక్తి-పాలకొండ

బాపట్ల జిల్లా జజ్జిలమూడి అమ్మ వారి ఆశ్రమంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈనెల 26న సత్యహరిశ్చంద్ర నాటకం నిర్వహించగా, అందులో హరిశ్చంద్ర పాత్రధారి నిగా పాలకొండ శంకరరావు నటించారు. ఆయన నటనకు ఆ సంఘం నిర్వాహకులు ఏర్పాటు చేసి నిర్వేతలు ఎంపిక చేయడంతో శంకరరావుకు సత్కరించారు. ఈ సందర్భంగా శంకరరావుకు పూర్వపు గ్రంథాలయ అధ్యక్షులు సాహిణి వరప్రసాద్ అభినందించారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

రహదారి ప్రారంభం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని గోచెక్క పంచాయతీ పరిధిలో కొసరివానివలసలో రూ.90లక్షలతో నిర్మించిన బిటి రహదారిని గురువారం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సంక్షేమమే ధ్యేయంగా నియోజకవర్గంలోని అన్ని గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పిం చామన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచి ఉదయాన శకుంతల, ఎంపిపి మజ్జి శోభారాణి, జడ్పీటీసీ బలగరేవతమ్మ, వైస్ ఎంపీపీలు బి.రవికుమార్ సిద్ధ జగన్నాథరావు, నాయకులు బొమ్మి రమేష్, బలగ నాగేశ్వరరావు, మజ్జి చంద్రశేఖర్, గణేష్, సుందరరావు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి పెట్టండి

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణపై అధికారులు దృష్టి సారించాలని సభ్యులు కోరారు. గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశంలో కౌన్సిలర్లు మాట్లాడారు. కౌన్సిలర్ రాపాక మాధవరావు మాట్లాడుతూ వార్డు పరిధిలో ఉన్న మజ్జులపేటలో సామాజిక మరుగుదొడ్డికి వెళ్లేదారిలో బల్బు వేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని చెప్పారు. విద్యుత్ దీపం లేకపోవడంతో పాముకాటు కు గురయ్యే అవకాశాలు వున్నాయని చెప్పారు. మూడునెలలుగా కోరుతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. పట్టణంలో పారిశుధ్యంపై దృష్టి సారించాలని వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు కోరారు. కౌన్సిలర్లు బి.శ్రీనివాసరావు,గొర్లి వెంకటరమణ, రాపాక మాధవరావు కూడా పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలని సూచించారు. మరమ్మతులకు గురైన సామాజిక మరుగుదొడ్లను బాగు చేయాలని వైస్ చైర్మన్ వంగపండు కోరారు. రూ.50వేలలోపు ఖర్చు అయ్యే పనులు చేపట్టాలని కమిషనర్ జయరాం ఎఇ సూరి నాయుడును ఆదేశించారు. అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థలం సూచించాలని కౌన్సిలర్లు సింగారపు ఈశ్వరరావు, గొల్లపల్లి వరప్రసాద్ కోరారు. అలాగే స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి పక్కన అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసుకోవచ్చునని కమిషనర్ జయరాం చెప్పారు. సమావేశంలో వైస్ చైర్మన్ జర్జాపు దీప్తి, ఫ్లోర్ లీడర్ గొర్లి జగన్మోహన్‌రావు, కౌన్సిలర్లు, వివిధశాఖ అధికారులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశంలో సభ్యులు



సమస్యలపై మాట్లాడుతున్న కౌన్సిలర్

జెండా దిమ్మను తొలగించండి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

అనుమతి లేకుండా నిర్మాణం చేపట్టిన జెండా దిమ్మను తొలగించాలని తెలుగు యువత పట్టణ అధ్యక్షులు పాలకొండ రాజశేఖర్ మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడును కోరారు. ఈ మేరకు గురువారం పార్వతీపురం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి బోనెల విజయ్ చంద్ర, సీనియర్ నాయకులు బార్నాల సీతారాం, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు గుంట్రెడ్డి రవికుమార్, మజ్జి వెంకటేష్‌తో కలిసి కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు కమిషనర్‌తో మాట్లాడుతూ పట్టణంలోని 25వ వార్డులో గల వేమకోటి వారి వీధి చివర కూడలి వద్ద ఏడాది క్రితం టిడిపి జెండా దిమ్మను, మాజీ సిఎం ఎన్‌టి రామారావు విగ్రహాన్ని నిర్మించేందుకు తలపెడితే, అప్పటి కమిషనర్ పి.సింహాచలం జెండా దిమ్మ, విగ్రహ నిర్మాణం చేపట్టవద్దని పట్టణ అధ్యక్షులకు నోటీసులు జారీ చేశారని తెలిపారు. ఒకవేళ నిర్మాణం చేపడితే కలెక్టర్ అనుమతి తీసుకోవాలని తెలిపారన్నారు. ఇప్పుడు ఇదే కూడలి వద్ద రెండు రోజుల క్రితం వైసిపి పార్టీ వారు జండా దిమ్మ నిర్మాణం చేపట్టారని ప్రతిపక్షానికి ఒకరూల్, అధికార పక్షానికి ఒక రూలా అని ప్రశ్నించారు. కాలువపై నిర్మాణం చేపట్టడం వలన మురుగునీరు పోయేందుకు అవకాశం లేదని దీనితో పాటు అక్కడ కార్యాలయ వాతావరణం కనిపిస్తుందని, దీనివల్ల చుట్టుపక్కల పరిసరాల వాసులు ఇబ్బందులు పడుతున్నారని, జెండా నిర్మాణం జరిగిన స్థలాన్ని మీరు అధికారులతో కలిసి పరిశీలించి తొలగించి తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలోకౌన్సిలర్ పాలకొండ మరియదాస్, నాయకులు రమణ,శంకర్, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రతి విద్యార్థి చక్కగా చదువుకొని ఉద్యోగం సంపాదించి జీవితాన్ని సాఫీగా చేసుకొనేందుకు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.శ్రీవరం అన్నారు. గురువారం స్థానిక డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా కరపత్రాన్ని విడుదల చేసిన అనంతరం ఆమె మాట్లాడుతూ డిసెంబర్ 5న తమ కళాశాలలో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నామన్నారు. ఈ జాబ్ మేళాకు సుమారు 8 ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల చెందిన 400 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలను కల్పిస్తున్నట్లు ఆమె అన్నారు. ఈ జాబ్ మేళాకు పదో తరగతి పాసైన అభ్యర్థులతో పాటు, ఇంటర్, డిగ్రీ పాసైన, ఫెయిల్ అయిన అభ్యర్థులు హాజరు కావచ్చని తెలిపారు. ఈ మెగా జాబ్ మేళాను ప్రతి నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అలాగే డిసెంబర్ 1న అంతర్జాతీయ ఎయిడ్స్ దేను పురస్కరించుకుని కళాశాలలో గురువారం వివిధ పోటీలను విద్యార్థులకు నిర్వహించామన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు అంతర్జాతీయ ఎయిడ్స్ డే రోజున బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒలు డి.రామయ్య, త్రినాధ, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్ శ్రీవరం

గిరిజనుల అభివృద్ధి శూన్యం : టిడిపి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కురుపాం నియోజకవర్గంలో గొప్పలు చెప్పుకోవడమే తప్ప వైసిపి చేసిన అభివృద్ధి ఏమీ లేదని నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి తోయక జగదీశ్వరి విమర్శించారు. బొమ్మ లక్ష్మీపురంలో గురువారం స్థానిక విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బుధవారం జరిగిన సాధికార బస్సు యాత్ర సమావేశంలో ఎవరు చేయని అభివృద్ధి ఒక్క జగన్మోహన్ రెడ్డి మాత్రమే చేశారని గొప్పలు చెప్పుకోవడం విచారకరమన్నారు. పూర్ణపాడు - లాబేసు, ఏనుగుల సమస్య, గిరిజనుల మోత డోలీలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఇదేనా గిరిజన అభివృద్ధి అని విమర్శించారు. మరోవైపు వర్షాల్లేక పంటలు పూర్తిగా ఎండిపోయి కరువు ఏర్పడితే కనిపించలేదా అన్నారు. కరువు మండలంగా ప్రకటించనప్పుడు ఎందుకు ఈ బస్సు యాత్రలు అన్నారు. జిఒ 3రద్దు, గిరిజనులకు ఉపాధి లేకుండా చేయడమేనా అభివృద్ధి అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్.రాజేష్, చిన్నారావు జానకి తదితరులు ఉన్నారు.

గిరిజన గ్రామాల్లో బాబు షూరిటీ... భవిష్యత్తు గ్యారంటీ

ప్రజాశక్తి - కురుపాం

చంద్రబాబునాయుడుతోనే గిరిజన, బడుగు బలహీన వర్గాలకు భవిష్యతుఉంటుందని కురుపాం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి టి.జగదీశ్వరి అన్నారు. మండలంలో గుజ్జువాయి పంచాయతీలో గల పలు గిరిజన గ్రామాల్లో గురువారం బాబు, షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి టిడిపి అధికారంలోకి వస్తే తీసుకొస్తున్న పథకాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో కచ్చితంగా టిడిపికి ఓట్లు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హెచ్.సుబ్బలక్ష్మి, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలోని కొతాంలో పాలకొండ నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో బాబు షూరిటీ -భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జయకృష్ణ మాట్లాడుతూ మినీ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ అంశాలను వివరిస్తూ ఖచ్చితంగా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమం క్లస్టర్ ఇంచార్జ్ నిమ్మక చంద్రశేఖర్, భవిష్యత్తు గ్యారెంటీ ప్రచారకర్త తోయిక సంధ్యారాణి, రామారావు, సవర నాయుడు,సవర గంగయ్య, సవర రవి, సవర శ్రీను, సవర సుందర రావు,గ్రామపెద్దలు మహిళలు ముఖ్యులు పాల్గొన్నారు.



సీతంపేట : కొతాంలో ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు జయకృష్ణ



బోరును ప్రారంభిస్తున్న సర్పంచ్ సుజాత

తాగునీటికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

తన పంచాయతీ పరిధిలో తాగునీటి సౌకర్యాల వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు జియమ్మవలస మండలం పెద్దబుడ్డిడి సర్పంచ్ శీమల సుజాత తెలిపారు. గదబవలసలో రూ. రెండు లక్షల 50 వేలు జడ్పీ నిధులతో కొత్తగా నిర్మించిన బోరును ఆమె ప్రారంభించారు. ప్రతి గ్రామంలో ప్రజలకు తాగునీరు అన్నివేళలా అందుబాటులో ఉండేలా కృషి చేస్తున్నట్లు ఆమె తెలిపారు. పెద్దబుడ్డిడిలో ఉన్న రక్షిత మంచినీటి పథకం ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు సరఫరా చేస్తున్నామని చెప్పారు. ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా ప్రతిరోజు గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు శీమల బాబు భువన మోహన్ రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సాగు భూమికి పట్టాలివ్వాలి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలోని పెదమరికి పంచాయతీ, శివన్నదొరవలస గిరిజన గ్రామపరిధిలో తాతదండ్రుల నుంచి సాగుచేస్తున్న భూమలకు పట్టాలు ఇవ్వాలని అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.సంగం డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం గిరిజనులతో కలిసి స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ వెంకటరమణకు వినతి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనులు అనేక రకాలు పం టలు పండించుకుంటూ, జొన్న, కందులు, జీడి, మొదలగు పంటలు పండించుకుంటున్న భూములపై విచారణ జరిపి పట్టాలు ఇప్పించాలని కోరారు. నాలుగేళ్ల నుంచి తిరుగుతూ తహశీల్దార్, కలెక్టరు, ఆర్‌డిఒ కార్యాలయాలకు పలుమార్లు కలిసి వినతులు అందజేశామన్నారు. కానీ ఇంతవరకూ ఇదిగో, అదిగో ఇస్తామని నాలుగుమార్లు సర్వే చేసియున్నారన్నారు. కానీ ఇంతవరకు అధికారులు రావడమే కాని పట్టాలు ఇచ్చేది లేదని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పట్టాలు ఇప్పించాలని కోరారు.

ఎండియు వాహనాల్లో జనాల తరలింపా?

కురుపాం నియోజకవర్గ జనసేన సమన్వయకర్త

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రజా పంపిణీ వ్యవస్థకు వినియోగించాల్సిన ఎండియు వ్యాన్లలో పార్టీ సమావేశాలకు జనాలను తరలించడమేమిటని కురుపాం నియోజకవర్గ జనసేన సమన్వయకర్త కద్రక మల్లేశ్వరరావు ప్రశ్నించారు. గురువారం ఆయన గుమ్మలక్ష్మీపురంలో విలేకరులతో మాట్లాడుతూ నవంబర్ 29న కురుపాంలో వైసిపి తలపెట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రకు ప్రజలను తరలించేందుకు ప్రభుత్వ వాహనాలు వినియోగించుకోవడం నిబంధనలకు విరుద్ధమన్నారు. మండలంలోని డుమ్మంగి గ్రామపంచాయతీ పరిధిలోని టెంక సింగి, గుణద, కోసంగి భద్ర, కొరటిగూడ గ్రామాల్లోని ప్రజలకు నిత్యవసర సరుకులు సరఫరా చేసే వ్యాను లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే, వైసిపి వాటిని వినియోగించుకోవడం చట్టరీత్యా నేరమని, ఇది వారికి తెలియదా అని ప్రశ్నించారు. పార్టీ కార్యక్రమాలను సొంత నిధులు ఖర్చుపెట్టి చేయలే తప్ప ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టేలా నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదన్నారు. ఒకవైపు ప్రజలు ఇబ్బందులు పడుతుంటే వారికి ఉపశమనం కలిగేలా ప్రయత్నించాలి తప్ప ప్రభుత్వం ఇటువంటి నిర్ణయాలు తీసుకోవడం ఎంతవరకు సమంజసమని ఆయన అన్నారు. ప్రజల సొమ్మును ఇలా దుర్వినియోగం చేయడం తగదన్నారు. పాలకులు ప్రజలకు ఇబ్బందికర పరిస్థితులు కల్పిస్తే రానున్న ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

చెరువులను కాపాడాలి

ప్రజాశక్తి - బెలగాం

పార్వతీపురంలో కబ్జాకు గురవుతున్న చెరువులు, ప్రభుత్వ స్థలాలను కాపాడేలా అధికారులకు బుద్ధిని ప్రసాదించాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు రేజేటి దయామణి, పట్టణ అధ్యక్షులు సిగడం భాస్కరరావు తదితరులు మహాకవి గురజాడ విగ్రహాన్ని కోరారు. గురజాడ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక రైతు బజార్ జంక్షన్లో ఉన్న గురజాడ విగ్రహానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. దొంగ పట్టాలు గుట్టలు గుట్టలుగా దర్శనమిస్తూ వాటితోనే ఆక్రమణదారులు చెరువులు, ప్రభుత్వ స్థలాల్లో పక్కా భవనాలు కడుతునా జిల్లా అధికారుల సైతం నోరు మెదపకపోవడం పట్ల పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువులను కాపాడాలని కోరారు.

నేరాలు ఘోరాలు

లారీ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్



మృతుడు గణపతి

లారీ ఢీకొన్న సంఘటనలో మండలంలోని ఉల్లిభద్రకు చెందిన పొడుగు గణపతి (63) గురువారం మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గణపతి ఉల్లిభద్రలో కిరాణా వ్యాపారం చేసుకుంటా జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం ఉల్లిభద్ర నుండి రోజువారీ పనుల్లో భాగంగా పార్వతీపురం వెళ్తుండగా అడ్డాపుశీల వద్ద వెనుక నుంచి వస్తున్నా లారీ వేగం వచ్చి ఢీకొని ఆయనపై నుంచి వెళ్లడంతో నుజ్జునుజ్జయి అక్కడిక్కడే మృతి చెందాడు. రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ దినకర్ లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు. గణపతి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరై రోధిస్తున్నాయి. మతునికి భార్య ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కిరాణా వ్యాపారంతో కుటుంబాన్ని నెట్టుకు వస్తున్న గణపతితో వారంతా అనాథలుగా మారారని గ్రామస్తులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా పారాది వంతెన కారణంగా భారీ వాహనాలను పాలకొండ వైపు మళ్లించడంతో రహదారులు పూర్తిగా చిద్రంగా మారి గ్రామీణులు తరచూ రహదారి ప్రమాదాలకు గురి అవుతున్నారని వాహనదారులు విమర్శిస్తున్నారు. ప్రతి రెండు రోజులకు ఇలాంటి సంఘటన జరగడం వల్ల వాహనదారులు ప్రాణాలను కోల్పోయి వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయని, అధికారులు, ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధితో వ్యవహరించి పారాది వంతెన నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేసి ప్రజలను రక్షించాలని కోరుతున్నారు.

ఆస్తి కోసం అన్నదమ్ముల ఘర్షణ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రమైన వీరఘట్టంలో అన్నదమ్ముల మధ్య ఆస్తి తగాదా గురువారం జరిగింది. ఈ ఘర్షణలో సంబంధించి తమ్ముడు భోగి ప్రతాప్ తన అన్న భోగి శ్రీనివాసరావు తలపై కొట్టి గాయపర్చాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. క్షతగాత్రుడ్ని పాలకొండ ప్రాంతీయ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు.